సాక్షి
గుంటూరు
మంగళవారం । 1 । ఆగస్టు । 2023




పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: ఎగువ పరీవాహక ప్రాంతాల నుంచి వరద నీరు వచ్చి చేరుతుండటంతో పులిచింతల ప్రాజెక్టు సోమవారం సాయంత్రానికి 32.6455 టీఎంసీలకు చేరింది.



త్రికోటేశ్వరునికి వెండి బిందె

నరసరావుపేట రూరల్: కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామికి ఎం.శ్రీనివాసరావు, వరలక్ష్మి దంపతులు కొడుకు వినీత్ పుట్టినరోజు సందర్భంగా 649 గ్రాముల వెండి బిందె బహూకరించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 515 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది.

న్యూస్‌రీల్

వైఎస్సార్ సీపీ రీజినల్ కో-ఆర్డినేటర్ల నియామకం



ఆళ్ల అయోధ్యరామిరెడ్డి



మర్రి రాజశేఖర్

పట్నంబజారు(గుంటూరు ఈస్ట్): వైఎస్సార్ సీపీ గుంటూరు, విజయవాడ, మచిలీపట్నం రీజినల్ కో–ఆర్డినేటర్లుగా రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్‌లను నియమిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈమేరకు కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి సోమవారం ఆదేశాలు వెలువడ్డాయి. దీంతో ఇకపై గుంటూరు, విజయవాడ, మచిలీపట్నం పార్లమెంటరీ జిల్లాల రీజినల్ కో ఆర్డినేటర్లుగా ఎంపీ ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ వ్యవహరించనున్నారు.

నేటి ఉదయం నుంచే పింఛన్ కానుక పంపిణీ

నరసరావుపేట: పల్నాడు జిల్లాలో 2,67,487 మందికి మంగళవారం ఉదయం ఐదు గంటల నుంచే సామాజిక భద్రతా పింఛన్లు పంపిణీ చేయనున్నట్టు జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ పథక సంచాలకులు బాలు నాయక్ సోమవారం వెల్లడించారు. వలంటీర్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు ఒకటో తేదీన ఉదయం ఐదు గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంటలోపు ప్రతి పెన్షన్‌దారుడి ఇంటి వద్దకు వెళ్ళి సక్రమంగా నూరుశాతం పెన్షన్లు పంపిణీ చేస్తారన్నారు. అన్ని మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మునిసిపల్ కమిషనర్లకు సూచనలు జారీ చేశామని పేర్కొన్నారు.

19న జెడ్పీ సర్వసభ్య సమావేశం

అదే రోజు స్థాయీ సంఘాల భేటీ

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 19న నిర్వహించేందుకు జెడ్పీ పాలకవర్గం నిర్ణయించింది. ఈమేరకు జెడ్పీ సీఈఓ జె.మోహనరావు సోమవారం షెడ్యూల్ విడుదల చేశారు. సర్వసభ్య సమావేశంతోపాటు ఏడు స్థాయీ సంఘ సమావేశాలను అదే రోజున సమావేశపరిచేందుకు జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా నిర్ణయించారు. ఈనెల 19న ఉదయం 10 గంటల నుంచి ఆర్థిక–ప్రణాళిక, గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, విద్య–వైద్యం, మహిళా సంక్షేమం, అభివృద్ధి పనులకు సంబంధించిన ఏడుస్థాయీ సంఘాలు భేటీ కానున్నాయి. అదే రోజు మధ్యాహ్నం 2 గంటలకు జెడ్పీ సర్వసభ్య సమావేశం జరగనుంది. ఈ మేరకు ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధులు, జెడ్పీటీసీలు, ప్రభుత్వ శాఖల అధికారులకు సమావేశాల షెడ్యూల్ పంపించారు.

ఆర్డీగా డాక్టర్ శోభారాణి



గుంటూరు మెడికల్: గుంటూరు ప్రాంతీయ వైద్య ఆరోగ్య శాఖ సంచాలకులు (ఆర్డీ)గా డాక్టర్ జి.శోభారాణిని నియమిస్తూ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ వి.రామిరెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆర్డీగా పనిచేస్తున్న డాక్టర్ జొన్నలగడ్డ యాస్మిన్ పదవీ విరమణ చేయడంతో నరసరావుపేట డీఎంహెచ్‌ఓగా పనిచేస్తున్న డాక్టర్ శోభారాణిని ఆర్డీగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.


31,875 బస్తాల మిర్చి రాక



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 31,875 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 30,259 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.9,500 నుంచి రూ.23,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి 26,500 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.11,500 నుంచి రూ.20,000 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.12,000 నుంచి 26,000 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.14,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 9,908 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

జన నిరసన ‘గళం’

- యువగళం పాదయాత్రపై పెదవి విరుపు
- లోకేష్ చేయాల్సింది క్షమాపణ యాత్ర అంటూ ప్రజల గర్జన
- గతంలో గద్దెనెక్కిస్తే ఏం చేశారంటూ ప్రశ్న
- పల్నాడులో నేటి నుంచి చినబాబు యాత్ర



ఆక్రమణల నుంచి విముక్తి కల్పించిన తర్వాత నీటితో కళకళలాడుతున్న వినుకొండ మంచినీటి చెరువు

సాక్షి, నరసరావుపేట: టీడీపీ అధినేత చంద్రబాబు తనయుడు లోకేష్ యువగళం యాత్రపై పల్నాడు ప్రజలు నిరసన గళమెత్తుతున్నారు. గతంలో గద్దెనెక్కిస్తే ఈ ప్రాంతానికి ఏం చేశారని ప్రశ్నిస్తున్నారు. మంగళవారం నుంచి జిల్లాలో పాదయాత్ర చేయనున్న లోకేష్‌ను నిలదీసేందుకు సిద్ధమవుతున్నారు. గతంలో తమను మోసం చేసినందుకు ముందు క్షమాపణ చెప్పి తర్వాత యాత్ర చేపట్టాలని సూచిస్తున్నారు.

నాలుగు శాఖలకు మంత్రిగా పనిచేసి..

దొడ్డిదారిలో గత ప్రభుత్వంలో నాలుగు శాఖలకు మంత్రిగా పనిచేసిన నారా లోకేష్, 14 ఏళ్ల రాష్ట్రానికి సీఎంగా చేసిన చంద్రబాబు పల్నాడుకు ఒరగబెట్టిందేమీ లేదు. 2014 ఎన్నికల్లో పల్నాడు ప్రజలు టీడీపీకి అండగా నిలిచారు. ఐదు అసెంబ్లీ, ఓ లోక్‌సభస్థానం ఆ పార్టీకి కట్టబెట్టారు. అయినా ఈ ప్రాంతానికి టీడీపీ ప్రభుత్వం ఏమీ చేయలేదు. వినుకొండ, మాచర్ల ప్రాంతాల్లోని ప్రజలకు కనీసం తాగడానికి గుక్కెడు మంచి నీటిని అందించిన పాపానపోలేదు. సుమారు 2.78 లక్షల మంది రైతు కుటుంబాలకు రుణమాఫీ చేస్తానని హామీనిచ్చి చంద్రబాబు మోసం చేశారు. వందలాది హామీలను తుంగలో తొక్కారు. అందుకే ప్రజలు 2019లో ఓటుతో బుద్ధిచెప్పారు. ఆ పార్టీకి ఈ ప్రాంతంలో ఉనికే లేకుండా చేశారు. ఇప్పుడు మళ్లీ ఎన్నికలు సమీపిస్తుండటంతో ప్రజలను మోసం చేసేందుకు లోకేష్ యువగళం పాదయాత్ర చేపట్టారు. మంగళవారం నుంచి నూజెండ్ల మండలం ముప్పారాజువారిపాలెం నుంచి యాత్రను ప్రారంభించనున్నారు.

చంద్రబాబు హయాం అంతా అన్యాయమే

వినుకొండ, మాచర్ల ప్రాంతాల్లో చాలా గ్రామాల్లో తీవ్ర తాగునీటి ఎద్దడి ఉంటుంది. 2014 ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి వస్తే ప్రతి గ్రామానికి తాగునీటిని అందిస్తామని హామీనిచ్చి గద్దెనెక్కిన తర్వాత మరిచారు. వినుకొండలో ట్యాంకర్లతో తాగునీరు సరఫరాకు నెలకు రూ. 4 కోట్లు ఖర్చు చేశామని లెక్కలు చూపి టీడీపీ కార్యకర్తలే భారీమొత్తంలో మున్సిపల్ నిధులు దోచేశారు. ప్రజలకు తాగునీరు అందలేదు. వరికపూడిసెల ప్రాజెక్టుకు చంద్రబాబు 1996, 2019లలో రెండు సార్లు శంకుస్థాపన చేశారు. అటవీ, వైల్డ్‌లైఫ్ అనుమతులను కేంద్రం నుంచి తీసుకోకుండా రైతులను మభ్యపెట్టేందుకే శిలాఫలకాలతో షో చేశారు. బాబు హయాంలో గిట్టుబాటు ధర లభించక రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. పంట నష్టపోయిన రైతులకు పైసా పరిహారం అందలేదు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక అభివృద్ధి

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వినుకొండ పట్టణంలో తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించారు. గతంలో 10 ఎకరాల్లో కుచించుకుపోయిన మంచి నీటి చెరువు ఆక్రమణలు తొలగించి 280 ఎకరాలకు విస్తరించి ప్రజల తాగునీటి సమస్య పరిష్కరించారు. రూ.209.17 కోట్లతో జేజేఎం, రూ.1,200 కోట్లతో వాటర్‌గ్రిడ్ పనులు చేపట్టారు. గతంలో చంద్రబాబు వినుకొండకు హార్టికల్చర్ కళాశాల మంజూరు చేస్తున్నామని చెప్పి ఐదేళ్ల కాలం గడిపితే వైఎస్ జగన్ అధికారం చేపట్టాక వినుకొండలో హార్టికల్చర్ కళాశాల ఏర్పాటుకు అనుమతులు తీసుకు వచ్చారు. వచ్చే ఏడాది నుంచి తరగతులు ప్రారంభించేందుకు చర్యలు చేపడుతున్నారు.

- పల్నాడు ప్రాంత రైతులకు వరప్రదాయిని వరికపూడిసెల ప్రాజెక్టు నిర్మాణానికి అన్ని అనుమతులనూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తీసుకువచ్చింది. త్వరలో పనులు ప్రారంభించనుంది.
- వైఎస్ జగన్ ప్రభుత్వంలో రైతులకు గిట్టుబాటు ధర అందుతోంది. ప్రకృతివైపరీత్యాలు సంభవిస్తే కర్షకులకు నాలుగునెలల్లోనే నష్టపరిహారం లభిస్తోంది. ఉచిత పంటల బీమా పథకం దిగ్విజయంగా అమలవుతోంది.

ఆర్‌ఓ ప్లాంట్ పథకం ఎక్కడ లోకేష్!

పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, ఐటీ శాఖ మంత్రిగా ఉన్న సమయంలో జూన్ 5, 2018న రూ.9.91 కోట్లతో వినుకొండ రూరల్, శావల్యాపురం, నూజెండ్ల మండలాల్లో 110 గ్రామాలకు తాగునీరు అందించేందుకు ఎన్టీఆర్ సుజల ఆర్‌ఓ ప్లాంట్ పథకం నిర్మాణం లోకేష్ ప్రారంభించారు. అయితే ప్లాంట్ పనులు పూర్తి చేయలేదు. ఆగిపోయిన నిర్మాణాల మధ్య శిలాఫలకం అలంకారప్రాయంగా దర్శనమిస్తోంది. దీనిని లోకేష్ ఓసారి చూసివెళ్లాలని స్థానికులు ఎద్దేవా చేస్తున్నారు.



ఆర్వోప్లాంట్ పథకం కోసం తిమ్మాయపాలెం వద్ద టీడీపీ వేసిన శిలాఫలకం →



యూనివర్సిటీ ప్రధాన ద్వారం వద్ద సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న అధ్యాపకులు

అధ్యాపకుల వయోపరిమితి పెంపు హర్షణీయం

- మెరుగైన సేవలకు దోహదం
- వీసీ ఆచార్య రాజశేఖర్
- సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం

ఏఎన్‌యూ: యూజీసీ పే స్కేల్ పొందుతున్న రెగ్యులర్ అధ్యాపకుల వయోపరిమితిని 65 ఏళ్లకు పెంచడం హర్షణీయమని వీసీ ఆచార్య పి.రాజశేఖర్ పేర్కొన్నారు. రాష్ట్రంలో పలు యూనివర్సిటీలు, ఉన్నత విద్యా సంస్థల్లో యూజీసీ పే స్కేల్ పొందుతున్న రెగ్యులర్ అధ్యాపకుల వయోపరిమితిని 65 ఏళ్లకు పెంచడంపై హర్షం వ్యక్తం చేస్తూ యూనివర్సిటీ అధ్యాపక సంఘం నూటా ఆధ్వర్యంలో సోమవారం యూనివర్సిటీలో కృతజ్ఞతాభివందన సభ నిర్వహించారు. వీసీ మాట్లాడుతూ అధ్యాపకుల వయోపరిమితి పెంపు వలన విద్యార్థులకు మరిన్ని సేవలు అందించే అవకాశం కలుగుతుందని చెప్పారు. ఉన్నత విద్యలో రాష్ట్ర వ్యాప్తంగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో రెగ్యులర్ అధ్యాపకుల నియామకాలు జరిగాయని, నేడు ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో అధ్యాపకుల పదవీ విరమణ వయోపరిమితి పెంపు జరిగిందన్నారు. రెక్టార్ ఆచార్య పి.వరప్రసాద్ మూర్తి మాట్లాడుతూ దక్షిణ భారతదేశంలోనే ఆంధ్రప్రదేశ్‌లో అధ్యాపకుల వయోపరిమితిపై గొప్ప నిర్ణయం తీసుకున్నారని కొనియాడారు. రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ మాట్లాడుతూ ప్రభుత్వం ఇలాంటి నిర్ణయం తీసుకోవడం శుభ పరిణామమన్నారు. నూటా అధ్యక్షుడు డాక్టర్ బి.నాగరాజు కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. డాక్టర్ వైఎస్సార్ ఏఎన్‌యూ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి.సిద్ధయ్య, నూటా కార్యవర్గ సభ్యులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం..

సభకు ముందు నూటా ఆధ్వర్యంలో యూనివర్సిటీలోని దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి నూటా పాలకవర్గ సభ్యులు, అధ్యాపకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం యూనివర్సిటీ ప్రధాన ద్వారం వద్ద ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు.

మిర్చి యార్డు చైర్మన్ రాజనారాయణ బాధ్యతల స్వీకరణ

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డు కొత్త చైర్మన్‌గా నిమ్మకాయల రాజనారాయణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. పలు ఫైళ్లపై సంతకాలు చేశారు. యార్డును పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తమపై నమ్మకంతో ఆసియా ఖండంలోనే అతి పెద్ద మార్కెట్ యార్డుకు చైర్మన్‌గా ఎంపిక చేశారని, సీఎం నమ్మకాన్ని వమ్ము చేయకుండా మిర్చి యార్డును ప్రథమస్థానంలో నిలిపేందుకు అందరి సహకారంతో శక్తి వంచన లేకుండా తమ పాలకవర్గం కృషి చేస్తోందని చెప్పారు. గుంటూరు మార్కెట్ యార్డులో ఏడాదికి రూ.10 వేల కోట్ల టర్నోవర్ జరుగుతోందని, మిర్చి, కారం పొడుల ద్వారా మరో రూ.5 వేల కోట్ల వ్యాపారం జరుగుతోందని వెల్లడించారు. 15 వేల మందికిపైగా జీవనోపాధి కల్పిస్తున్న రైతు సోదరులకు అన్ని విధాలుగా అండగా నిలుస్తామన్నారు. మిర్చి యార్డులో ఉన్న సమస్యలను అధిగమించి రైతులకు నాణ్యమైన సేవలు అందిస్తామని చెప్పారు. పార్టీలకు అతీతంగా యార్డుకు వచ్చే ప్రతి రైతుకూ న్యాయం జరిగేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. హమాలీలు, వేమెన్స్ సమస్యలూ పరిష్కరిస్తామని పేర్కొన్నారు. యార్డులో తాగునీరు, పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి, మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామన్నారు. యార్డులో నగదు రహిత లావాదేవీల అమలుకు చర్యలు తీసుకుంటామన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీనైన తనకు ఇంత ప్రాధాన్యం ఇచ్చి చైర్మన్‌గా నియమించారని కృతజ్ఞతలు తెలిపారు. ఈ ప్రభుత్వంలో బీసీలకు న్యాయం జరుగుతోందని చెప్పారు. కార్యక్రమంలో యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి, యార్డు వైస్ చైర్మన్ షేక్ మాబు సుభాని, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న మిర్చి యార్డు చైర్మన్ రాజనారాయణ

పెండింగ్ అర్జీలు వెంటనే పరిష్కరించాలి

కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

గుంటూరు: ఇప్పటివరకు పెండింగ్‌లో ఉన్న అర్జీలను తక్షణం పరిష్కరించాలని కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ పెండింగ్ అర్జీల పరిష్కారంలో ఆయా శాఖల జిల్లా అధికారులు సమన్వయం చేసుకోవాలన్నారు. స్పందన అర్జీలతోపాటు జగనన్నకు చెబుదాం, జగనన్న సురక్ష పథకాల్లో వచ్చిన అర్జీలనూ వేగంగా పరిష్కరించాలన్నారు. అర్జీల పరిష్కారంలో ఎదురయ్యే ఇబ్బందులను తమ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. అనంతరం వచ్చిన 182 అర్జీలను కలెక్టర్, జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, అధికారులు పరిశీలించారు.



స్పందన కార్యక్రమంలో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, జేసీ రాజకుమారి

ప్రభుత్వ పెయింటింగ్ పనులు ఇవ్వండి

ప్రభుత్వ పెయింటింగ్ పనులు దళారీ వ్యవస్థ లేకుండా తమకు అప్పగించాలని పెయింటింగ్(ఆర్ట్స్) వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నేతలు కలెక్టర్‌ను కోరారు.

- 100 పడకల ఏరియా ఆస్పత్రి భవనాలు పూర్తి
- త్వరలో ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు
- రూ. 2 కోట్లతో సమకూరిన అత్యాధునిక పరికరాలు
- అదనపు వసతుల కోసం రూ.9.5 కోట్లు మంజూరు
- ట్రామా సెంటర్ ఏర్పాటుకు రూ.2.40 కోట్లతో ప్రతిపాదనలు
- ఫలించిన మంత్రి విడదల రజిని కృషి



ఇదిగో ఈ చిత్రంలో కనిపిస్తున్నది చిలకలూరిపేట ఏరియా వైద్యశాల ఆస్పత్రి భవనాల నిర్మాణం. గత ప్రభుత్వంలో ఇలా పునాదుల దశలోనే నిలిచిపోయింది. అప్పటి పాలకుల కమీషన్ల కక్కుర్తికి, నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనం ఈ దృశ్యం.



కళ్లు మిరుమిట్లుగొలుపుతున్న ఈ భవనాలు చిలకలూరిపేట వంద పడకల ఏరియా ఆస్పత్రివి. గత పాలకుల నిర్లక్ష్యం వల్ల పునాది దశ దాటని వీటిని మంత్రి విడదల రజిని ప్రత్యేక చొరవ తీసుకుని పూర్తిచేయించారు. దీంతో ఆగస్టు 3న ప్రారంభోత్సవానికి అత్యాధునిక వసతులతో సిద్ధమయ్యాయి.

వైద్య వరప్రదాయిని

చిలకలూరిపేట: ఆరోగ్యవరప్రదాయిని అందుబాటులోకి రానుంది. సామాన్యుల ఆరోగ్య రక్షకు కొండంత అండ లభించనుంది. మంత్రి విడదల రజిని కృషితో చిలకలూరిపేట ప్రాంత ప్రజల చిరకాలవాంఛ 100 పడకల ప్రభుత్వాస్పత్రి కల సాకారం కానుంది. దీంతో అత్యాధునిక వైద్యం నిరుపేదల చెంతకు చేరువకానుంది. ఎమ్మెల్యేగా గెలుపొందిన నాటి నుంచి ప్రస్తుత రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని చొరవ, కృషి వల్లే 100 పడకల ప్రభుత్వాస్పత్రి నిర్మాణ పనులు దిగ్విజయంగా పూర్తయ్యాయి. ఆగస్టు మూడో తేదీన ఆస్పత్రి భవనాలు ప్రారంభం కానున్నాయి.

4.147 ఎకరాల విస్తీర్ణంలో..

ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాల సరిహద్దులో జాతీయ రహదారిపై విస్తరించి ఉన్న చిలకలూరిపేట ప్రాంతంలో రోడ్డు ప్రమాదాల శాతం అధికంగా ఉంటుంది. రెండు జిల్లాల ప్రమాద బాధితులతోపాటు, వివిధ అనారోగ్య సమస్యలతో వచ్చే వారితో ఇక్కడ ఉన్న 30 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నిత్యం కిటకిటలాడుతూ ఉంటుంది. ఈ నేపథ్యంలో ఇక్కడ 100 పడకల ఏరియా వైద్యశాల కోసం వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నుంచి గత ప్రభుత్వాలకు ఎన్నో వినతులు వెళ్లాయి. అలాంటి పరిస్థితుల్లో గత ప్రభుత్వ హయాంలో 100 పడకల ఆస్పత్రి నిర్మాణానికి పునాదులు పడినా పనులు మాత్రం ముందుకు సాగలేదు. దీనికి తోడు పాత 30 పడకల ప్రభుత్వాస్పత్రి ప్రాంగణంలో ప్రస్తుత పాత భవనానికి వెనుక లోతట్టులో పునాది పనులు నిబంధనలకు విరుద్ధంగా చేశారు. కమీషన్ల కక్కుర్తి తప్ప పనులపై చిత్తశుద్ధి లోపించటంతో కేవలం బేస్‌మెంట్ దశలోనే పనులు ఆగిపోయాయి. విడదల రజిని ఎమ్మెల్యేగా గెలుపొందిన తొలినాళ్లలోనే ఈ లోపాలను గుర్తించి నిబంధనల మేరకు నిర్మాణ పనులు కొనసాగేలా ఆ మేరకు నిధులు మంజూరు చేయించి పనులను పునఃప్రారంభింపజేశారు. ఆమె కృషి ఫలితంగా 4.147 ఎకరాల విస్తీర్ణంలో రూ.18.57 కోట్లతో ప్రభుత్వాస్పత్రి భవనాలు సర్వహంగులతో రూపుదిద్దుకున్నాయి. శంకుస్థాపనకు సిద్ధమయ్యాయి. మరో రూ.రెండు కోట్లతో ఆస్పత్రికి అవసరమైన అత్యాధునిక వైద్య పరికరాలు సమకూరాయి.



ఆస్పత్రిలో ఆపరేషన్ థియేటర్‌ను పరిశీలిస్తున్న రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని

అదనపు నిధులు మంజూరు

ప్రభుత్వాస్పత్రి వెనుక భాగంలో ఓగేరువాగు ప్రవహిస్తుంటుంది. ఈ నేపథ్యంలో మంత్రి రజిని సూచనల మేరకు భవనాలను ఎక్కువ ఎత్తులో నిర్మించారు. దీనికితోడు ఎలాంటి వరద ముప్పు లేకుండా ఆస్పత్రి చుట్టూ రిటైనింగ్ వాల్, ఆస్పత్రి ప్రాంగణంలో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.9.5 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది. దీంతో ఆస్పత్రికి అవసరమైన అన్ని హంగులూ సమకూరినట్లయింది. ఈనెల 3న ఈ పనులకు శంకుస్థాపన జరగనుంది.

అత్యాధునిక వసతులు

భవన నిర్మాణాలు పూర్తి చేసుకున్న 100 పడకల ఏరియా ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బంది నియామకాలు చేపట్టారు. 23 మంది వైద్యులు, 73 మంది వైద్య సిబ్బందిని ప్రభుత్వం కేటాయించింది. ఈ ఆస్పత్రి ప్రారంభమైతే రోగులకు 24 గంటలూ వైద్యం అందుబాటులోకి వస్తుంది. మూడు అత్యాధునిక ఆపరేషన్ థియేటర్లు, ల్యాబ్ సౌకర్యం, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, గైనకాలజీ, పీడియాట్రిక్స్, ఎనస్తీషియా, ఈఎన్‌టీ, ఆర్థోపెడిక్, ఫిజియోథెరపీ వైద్యులు నిత్యం అందుబాటులో ఉంటారు. 24 మంది స్టాఫ్ నర్సులు, నలుగురు హెడ్ నర్సులు, రేడియోగ్రాఫర్, ల్యాబ్‌టెక్నీషియన్, బయో మెడికల్ ఇంజినీర్ సేవలు అందుబాటులోకి వస్తాయి. మూడు ఆపరేషన్ థియేటర్లు, బ్లడ్ బ్యాంకు, అడ్వాన్స్‌డ్ ఎన్‌బీఎస్‌యూ, ఐసీయూ సేవలు ఇక్కడే లభ్యమవుతాయి. దీంతో ఇప్పటి వరకు అత్యవసర పరిస్థితుల్లో రోగులను గుంటూరుకు తరలించాల్సిన గతి ఉండదు.

ట్రామా కేర్ సెంటర్‌కు ప్రతిపాదనలు

జాతీయ రహదారిపై నిత్యం జరిగే ప్రమాద బాధితులను ఈ ఆస్పత్రికే తీసుకువస్తుంటారు. ఈ నేపథ్యంలో 100 పడకల ప్రభుత్వాస్పత్రికి అనుబంధంగా ట్రామాకేర్ సెంటర్ ఏర్పాటుకు మంత్రి రజిని హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలోనే ఇటీవల ఏపీఎంఎస్ఐడీసీ అధికారులు వచ్చి రూ.2.40 కోట్లతో ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటుకు ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి పంపారు. ఇవి త్వరలోనే మంజూరయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో రోడ్డు ప్రమాద బాధితులకు ప్రాణ రక్షణ లభించనుంది.

మోడల్ ఆస్పత్రిగా తీర్చిదిద్దుతాం

ఆస్పత్రి భవనాల నిర్మాణం పూర్తయింది. ఆగస్టు 3న ప్రారంభించి ప్రజలకు వైద్యసేవలు అందుబాటులోకి తీసుకువస్తాం. అవసరమైన నిధులు అడిగిన ప్రతిసారీ వెంటనే మంజూరు చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు. ఈ ఆస్పత్రిని మోడల్‌గా తీర్చిదిద్దుతాం.

– విడదల రజిని, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి

3న ప్రారంభం

ఆగస్టు మూడో తేదీన ఆస్పత్రి ప్రారంభించాలని రాష్ట్ర వైద్య,ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని ఆదేశించారు. భవన నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ఇప్పటికే నియమితులైన వైద్యులు పాత ఆస్పత్రి భవనంలో వైద్య సేవలు అందిస్తున్నారు. కొత్త భవనం ప్రారంభమైతే అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయి.

– డాక్టర్ కేవీ లక్ష్మీకుమారి, ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్

మణిపూర్‌లో శాంతి నెలకొల్పాలి



కొవ్వొత్తులతో ర్యాలీలో పాల్గొన్న పాస్టర్లు, క్రైస్తవ విశ్వాసులు

పాత గుంటూరు: మణిపూర్ రాష్ట్రంలో క్రైస్తవులపై జరుగుతున్న దాడులను నిలిపి, శాంతి నెలకొల్పాలని రెవరెండ్ డాక్టర్ రేబ్బా ఇమ్మానియేల్ కోరారు. సోమవారం లక్ష్మీపురం సర్కిల్‌లో ఎమినెంట్ పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో మణిపూర్‌లో జరుగుతున్న హింసాత్మక దాడులకు నిరసన తెలుపుతూ కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర సమాచార శాఖ కమిషనర్ శామ్యూల్ జోనాథాన్, క్రైస్తవ వ్యవహారాల సలహాదారు ఫాదర్ మద్దు బాలస్వామి, ఫెలోషిప్ ప్రెసిడెంట్ మోహన్, విజయ్‌కుమార్, బిషప్ బి.జాకబ్, ప్రేమ్‌కుమార్, బి.జోసఫ్, బి.యం.రాజు, వి.బాపూజీ, క్రైస్తవులు పాల్గొన్నారు.

దూర విద్య టెన్త్, ఇంటర్‌లో ప్రవేశాలు

గుంటూరు ఎడ్యుకేషన్: ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ (ఏపీఓఎస్ఎస్) ఆధ్వర్యంలో దూర విద్య టెన్త్, ఇంటర్మీడియెట్ కోర్సుల్లో ప్రవేశాలకు ఎటువంటి అపరాధ రుసుం లేకుండా ఈనెల 31వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవచ్చునని జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రస్తుత ఏడాది ఆగస్టు 31 నాటికి 14 ఏళ్ల వయసు నిండిన అభ్యర్థులు టెన్త్‌లో ప్రవేశానికి అర్హులని తెలిపారు. అదేవిధంగా 15 ఏళ్లు నిండి, టెన్త్‌లో ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఇంటర్లో ప్రవేశానికి అర్హులని వివరించారు. పూర్తి వివరాలకు www.apopenschool.ap.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

క్రికెటర్ అంబటి రాయుడు విస్తృత పర్యటన



తాడికొండ: తుళ్లూరు మండలంలో మాజీ క్రికెటర్ అంబటి రాయుడు సోమవారం పర్యటించారు. వెలగపూడిలోని శివాలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం అమరావతి రైతులు రోడ్డుపైకి రాగా వారితో మాట్లాడి సానుకూలంగా స్పందించారు. అనంతరం ఎస్సీ కాలనీలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మందడం జెడ్పీ హైస్కూల్‌కు చేరుకున్న ఆయన చిన్నారులతో కలసి కొద్ది సేపు సరదాగా క్రికెట్ ఆడారు. అనంతరం ఐనవోలు గ్రామాన్ని సందర్శించారు. వెలగపూడిలో డ్వాక్రా మహిళలతో ముచ్చటించి, వారికి ప్రభుత్వం నుంచి అందుతున్న సంక్షేమ పథకాలు, రుణమాఫీ, పావలా వడ్డీ అందుతున్న తీరుపై ఆరా తీశారు. ఆయన వెంట శృంగారపాటి సందీప్, చలివేంద్రం సురేష్, తుమ్మూరు రమణారెడ్డి, కొప్పుల శేషగిరిరావు ఉన్నారు.

సొమ్ము రికవరీలో వ్యత్యాసం

- అడిగితే.. దొరికినంత వరకు సంతోషించాలని అంటున్నారు
- న్యాయం చేయాలని స్పందనలో జిల్లా ఎస్పీకి బాధితుల మొర

నగరంపాలెం: పోగొట్టుకున్న చోరీ సొత్తు మొత్తాన్ని ఇవ్వలేదని భార్య భర్తలు వాపోయారు. థియేటర్ పైనుంచి ప్రమాదవశాత్తు కిందపడగా నష్టపరిహారం చెల్లించలేదని బాధితుడు ఆందోళన వ్యక్తం చేశారు. నగరంపాలెం జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలోని స్పందన హాల్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక – స్పందన (గ్రీవెన్స్) జరిగింది. జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్ అర్జీదారుల ఫిర్యాదులను స్వీకరించారు. వారి బాధలను ఆలకించారు. స్పందన సమస్యలపై నిర్లక్ష్యం వహించవద్దని ఎస్పీ సూచించారు. నిర్ణీత వేళల్లో చట్టప్రకారం పరిష్కరించాలని ఆదేశించారు. ఈ మేరకు సబ్ డివిజన్ల, పోలీస్‌స్టేషన్ల పోలీస్ అధికారులతో మొబైల్‌ఫోన్, జూమ్ ద్వారా మాట్లాడారు. ఏఎస్పీ (క్రైం) ఎ.శ్రీనివాసరావు, డీఎస్పీలు బాలసుందరరావు (ట్రాఫిక్), శ్రీనివాసరావు (డీసీఆర్‌బీ) కూడా అర్జీలు స్వీకరించారు.



బాధితుల సమస్యలు వింటున్న జిల్లా ఎస్పీ ఆరిఫ్ హఫీజ్, పక్కన ఏఎస్పీ శ్రీనివాసరావు

తక్కువ రికవరీ..

గతనెల ఐదే తేదీన మా ఇంట్లో చోరీ జరిగింది. 12న కేసుని ఛేదించి దొంగను అరెస్ట్ చేశారు. అయితే గతనెల 27న స్థానిక పోలీస్‌స్టేషన్‌కు పిలిచి, బంగారపు ఆభరణాలను కొన్ని మాత్రమే అప్పగించారు. అయితే మాకిచ్చిన బంగారు ఆభరణాలు తక్కువ. పోగొట్టుకున్న బంగారం, వెండి, నగదు ఎక్కువ. ఈ రెండింటికీ చాలా వ్యత్యాసం ఉంది. ఎన్నో ఏళ్లుగా కష్టపడి సంపాదించిన సొమ్ము అది. భవిష్యత్‌లో మనవరాళ్లు, కోడళ్లకు ఇవ్వాలని ఆశపడ్డాం. ఈలోగా దొంగతనం జరగడం, వస్తువులన్నీ అపహరణకు గురికావడంతో మానసికంగా కుంగిపోయాం. దీనిపై జిల్లా పోలీస్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. చోరీకి పాల్పడిన దొంగ ఎక్కడెక్కడ తిరిగాడనేది విచారించాలని ఆదేశించారు. అయితే ఇప్పటివరకు ఎటువంటి పురోగతి లేదు. దొంగలించిన బంగారు వస్తువుల్లో ఇరవై కనిపించడం లేదు. వెండి అస్సలు అప్పగించలేదు. పోయిన నగదు రూ.2.18 లక్షలకు గానూ రూ.30 వేలు ఇచ్చారు. అదేమని అడిగితే దొరికినవరకు సంతోషించాలని అంటున్నారు. మలివయసులో సంపాదించే శక్తి లేదు. చోరీపై మరింత లోతుగా విచారించి న్యాయం చేయగలరు.

– ఎస్.సుధారాణి, నరసింహారావు, వడ్డూరివారివీధి, కొత్తపేట

థియేటర్ యాజమాన్యం నిర్లక్ష్యం..

నాజ్ సెంటర్‌లోని ఓ థియేటర్‌లో ఆపరేటర్‌గా పనిచేసేవాడ్ని. జూన్ 23న థియేటర్ పైనున్న లైట్ వద్ద పనిచేసే క్రమంలో కిందపడ్డాను. ఎడమ చేయి, కాలుకి బలమైన గాయాలయ్యాయి. రూ.2 లక్షలు వెచ్చించి, ఓ ప్రైవేటు ఆసుపత్రిలో శస్త్రచికిత్స చేయించుకున్నా. కొన్నాళ్లు విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించారు. అయితే నష్ట పరిహారం విషయమై థియేటర్ యాజమాన్యాన్ని అడగ్గా ఇష్టానుసారంగా మాట్లాడారు. రోజు వారీ కూలీ పనులతో జీవించేవాళ్లం. యాజమాన్యం నుంచి నష్ట పరిహారం ఇప్పించాలి.

– దొడ్డా అంజిరెడ్డి, స్తంభాలగరువు మూడో వీధి

వీల్‌ఛైర్‌లో స్పందనకు బాధితుడు, ఆయన భార్య వచ్చారు. స్పందనలో ఉన్న ట్రాఫిక్ డీఎస్పీ బాలసుందర్ బాధితుని వద్దకు చేరుకుని ఆయన బాధను ఆలకించారు. వెంటనే స్టేషన్ అధికారితో మాట్లాడి, న్యాయం చేయాలని ఆదేశించారు.

టీడీపీ ముఖ్యనేత అండతో వేధింపులు..



ఇరు పెద్దల సమక్షంలో 2012లో మాకు పెళ్లయింది. 2013లో బాబు, 2015లో పాప జన్మించారు. భర్త అనుమతితో చిన్న ఆపరేషన్ చేయించుకున్నా. ఆడపిల్ల పుట్టిందనే సాకుతో నన్ను నా భర్త నుంచి వేరుచేశారు. పాపకు నామకరణం, మొదటి పుట్టిన రోజుకి సైతం ఎవరూ రాలేదు. అప్పటిదాకా పుట్టింట్లో ఉన్నాం. రెండేళ్ల తర్వాత పెద్దల సమక్షంలో భర్త కాపురానికి తీసుకెళ్లారు. అనంతరమూ గొడవలు జరిగాయి. పెద్దల సమక్షంలో, లోక్ అదాలత్‌తో రాజీపడ్డాం. మళ్లీ గొడవలు జరగ్గా నా భర్త నన్ను పుట్టింటిలో వదిలి వెళ్లాడు. ఇటీవల డీపీఓ స్పందనలో ఫిర్యాదివ్వగా, పట్టాభిపురం పీఎస్‌కు పంపించారు. బైండోవర్ కేసులు పెట్టారు. పిల్లలతో కలిసి అత్తారింటిలో ఉంటున్నా. ఈక్రమంలో టీడీపీ ముఖ్య నేత ఒకరు నా భర్త తరఫు కుటుంబ సభ్యులకు వత్తాసుగా వచ్చి, ఇళ్లు ఖాళీ చేయాలని హుకుం జారీచేశారు. టీడీపీ నేత కాళ్లపై పడినా కనికరించలేదు. నాకు న్యాయం చేయగలరు.

– ఇద్దరు పిల్లలతో వి.ఆషా, గుజ్జనగుండ్ల

డాక్టర్ యాస్మిన్ దంపతులకు ఘన సన్మానం



డాక్టర్ యాస్మిన్ దంపతులను సన్మానిస్తున్న పలువురు అధికారులు

గుంటూరు మెడికల్: గుంటూరు డీఎంహెచ్ఓగా, గుంటూరు ఆర్డీగా సుమారు వైద్య రంగంలో 36 సంవత్సరాల సుదీర్ఘ సేవలు అందించి సోమవారం ఉద్యోగ విరమణ చేసిన డాక్టర్ జొన్నలగడ్డ యాస్మిన్, డాక్టర్ వెంకటేశ్వరరావు దంపతులను సోమవారం ఘనంగా సన్మానించారు. గుంటూరులోని ఏపీ ఎన్జీఓ కల్యాణ మండపంలో జరిగిన సన్మాన కార్యక్రమానికి పలు జిల్లాలకు చెందిన డీఎంహెచ్ఓలు, వైద్యులు, వైద్య సిబ్బంది హాజరయ్యారు. పలువురు డీఎంహెచ్ఓలు, వైద్యులు డాక్టర్ యాస్మిన్‌తో తమకున్న అనుబంధాలను నెమరు వేసుకున్నారు. వైద్యురాలిగా, వైద్య అధికారిగా ఆమె సేవలను కొనియాడారు. అందరి సహకారంతో, భర్త ప్రోత్సాహంతో విజయవంతంగా వైద్యరంగంలో సుదీర్ఘకాలం పని చేశానని డాక్టర్ యాస్మిన్ తెలిపారు. ఏపీ ఎన్జీఓ నేతలు, గుంటూరు ఆర్డీ కార్యాలయ అధికారులు, ఉద్యోగులు డాక్టర్ యాస్మిన్ దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏపీ ఎన్జీఓ జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ నాగూర్ షరీఫ్, జిల్లా కార్యదర్శి శెట్టిపల్లి సతీష్ కుమార్, కోశాధికారి శ్రీధర్ రెడ్డి, సంయుక్త కార్యదర్శి కూరాకుల శ్రీనివాసరావు, గుంటూరు నగర అధ్యక్షుడు ఎస్‌పిఎస్ సూరి, కార్యనిర్వాహక కార్యదర్శి జి.వి.కోటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు బి.సునీల్ కుమార్, ఆర్డీ కార్యాలయ సూపరింటెండెంట్‌లు రాజ్‌కుమార్, సుధీర్, డెప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి, సీనియర్ అసిస్టెంట్లు సుబ్బారావు, శ్యామ్ అనిల్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

బజరంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'నీ గుండె పదిలం'

- ఘనంగా జగన్నామ సంక్షేమ కార్యక్రమాలు
- 26 మందికి యాంజియోగ్రామ్
- అవసరమైన ఏడుగురికి స్టంట్‌లు
- నలుగురికి హార్ట్ సర్జరీకి ఏర్పాట్లు



గుండె చికిత్సకు సిద్ధంగా ఉన్న మామిళ్లపల్లి గ్రామస్తులతో అంబటి మురళీకృష్ణ

చేబ్రోలు: సకాలంలో గుండె సమస్యలను గుర్తించని కారణంగా, పొంచి ఉన్న ప్రాణపాయం ముప్పు నుంచి రక్షించేందుకు బృహత్తర 'నీ గుండె పదిలం 'కార్యక్రమానికి బజరంగ్ ఫౌండేషన్ శ్రీకారం చుట్టింది. గుండె సమస్యలపై అవగాహన లేని గ్రామీణ ప్రాంత ప్రజల కోసం ఫౌండేషన్ ద్వారా మామిళ్లపల్లిలో చరిత్రాత్మక సేవా కార్యక్రమం చేపట్టినట్లు సీఈవో అంబటి మురళీకృష్ణ తెలిపారు. పొన్నూరు మండలం మామిళ్లపల్లి గ్రామంలో ఇటీవల వైద్య శిబిరం నిర్వహించి, 187 మందికి విజయవాడ మెడ్‌స్టార్ వైద్యశాల సహకారంతో నిపుణులైన వైద్యులతో వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో 37 మందికి యాంజియోగ్రామ్ చేయాల్సిన అవశ్యకత ఉందని తేలటంతో వీరిని మామిళ్లపల్లి నుంచి విజయవాడకు బజరంగ్ బృందం ప్రత్యేకంగా రెండు విడతలుగా బస్సులను ఏర్పాటు చేసి విజయవాడ మెడ్ స్టార్ వైద్యశాలకు సోమవారం తరలించింది. ఒక గ్రామాన్ని యూనిట్‌గా తీసుకొని ప్రయోగాత్మకంగా మామిళ్లపల్లి గ్రామంలో మీ గుండె పదిలం కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని మురళీకృష్ణ తెలిపారు. జగన్నామ సంక్షేమ సంవత్సరంలో భాగంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంతో సకాలంలో గుండె సమస్య ఉన్న వారిని గుర్తించి, ప్రాణపాయ ముప్పు నుంచి రక్షణ కల్పించటం సాధ్యమవుతుందని అంబటి మురళీకృష్ణ అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో, ఆయన ఆశయాలు, లక్ష్యాల సాధనకు బజరంగ్ ఫౌండేషన్ నిబద్ధతతో శ్రమిస్తుందన్నారు. అనంతరం బజరంగ్ ఫౌండేషన్ సీఈవో అంబటి మురళీకృష్ణ చికిత్స పొందుతున్న వారిని స్వయంగా పరామర్శించి, వారికి మానసిక స్థైర్యాన్ని అందించారు. జగనన్నతో మా గుండె పదిలం అంటూ ఆరోగ్య శ్రీ పథకం అమలు చేస్తున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ గుండె చికిత్సలన్నీ ప్రజాపక్ష ప్రభుత్వమైన జగనన్న నేతృత్వంలోని ప్రభుత్వ సాయం అత్యంత వేగంగా అందుబాటులోకి రావటంతో సులభంగా చికిత్సను అందించేందుకు ఏ ఆటంకాలు ఏర్పడని స్థితి ఉందని మురళీకృష్ణ తెలిపారు. రెండు బృందాలుగా 26మందికి యాంజియోగ్రామ్ నిర్వహించగా వీరిలో ఏడుగురికి స్టంట్ వేయటం, నలుగురికి హార్ట్ సర్జరీలు, ఒకరికి పేస్ మేకర్ ద్వారా చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. చికిత్స ప్రక్రియను చేపట్టిన మెడ్ స్టార్ హస్పటల్ యాజమాన్యం, వైద్యులు విజయ చైతన్య సిబ్బందిని అభినందించారు.

5, 6 తేదీల్లో స్టేట్ ఓపెన్ చెస్ టోర్నమెంట్



గుంటూరు: ఈనెల 5, 6 తేదీల్లో గుంటూరులో లీలావతి మెమోరియల్ ఏపీ స్టేట్ ఓపెన్ చెస్ టోర్నమెంట్ నిర్వహిస్తామని పోటీల నిర్వాహకుడు డి.శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో దీనికి సంబంధించి బ్రోచర్‌ను ఆవిష్కరించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ పోటీల్లో విజేతలకు రూ.75వేలు నగదు బహుమతి, ట్రోఫీలు అందజేస్తామన్నారు. పోటీల్లో పాల్గొనదలచిన వారు 9063142105కు సంప్రదించాలని తెలిపారు. జిల్లా చెస్ సంఘం అధ్యక్షుడు రవీంద్రరాజు, వై.వి.కె.చక్రవర్తి పాల్గొన్నారు.

నకిలీ బయో ఉత్పత్తులు స్వాధీనం

నిర్వాహకుడిపై కేసు నమోదు



నకిలీ బయో ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్న ఏడీఏ శ్రీనివాసరావు, సీఐ రామనాయక్

కొరిటిపాడు(గుంటూరు): అనుమతులు లేకుండా నకిలీ బయో ఉత్పత్తులు తయారు చేస్తున్న వ్యక్తిని వ్యవసాయశాఖ అధికారులు తయారీకి వినియోగించే ముడిసరుకును స్వాధీనం చేసుకున్నారు. కొటాల మురళీకృష్ణ అనే వ్యాపారి స్థానిక సంజీవయ్యనగర్, 6వ లైనులోని తన సొంత ఇంట్లో గత కొంతకాలంగా ఎస్‌కేఎం నేచురల్ ప్రొడక్ట్స్‌ను అనుమతి లేకుండా తయారు చేస్తూ రైతులకు అనధికారికంగా విక్రయాలు చేస్తున్నారు. గుంటూరు జిల్లా వ్యవసాయశాఖ అధికారి నున్నా వెంకటేశ్వర్లుకు అందిన ఫిర్యాదు మేరకు సోమవారం మురళీకృష్ణ ఇంటిలో గుంటూరు ఏడీఏ తోటకూర శ్రీనివాసరావు, అర్బన్ ఏఓలు అంజిరెడ్డి, కిషోర్‌లు తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో 100 లీటర్ల నకిలీ బయో లిక్విడ్, 20 లీటర్ల ఖాళీ డబ్బాలు 5, మిక్సీ, జార్, 329 నకిలీ లేబుల్స్(సంజిత్, శ్రీధర్, స్టార్‌వన్ పేర్లతో ఉన్నవి), 250 మిల్లీ లీటర్ల ఖాళీ డబ్బాలు 28 స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా గుంటూరు ఏడీఏ తోటకూర శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎస్‌కేఎం నాచురల్ ప్రొడక్ట్స్, మదనపల్లి పేరుతో తయారవుతున్న లేబుల్స్, వాటిపై ఉన్న చిరునామా తప్పుగా ఉన్నట్లు నిర్ధారించడం జరిగిందన్నారు. అంతేకాకుండా ఏ విధమైన లైసెన్స్, అనుమతి పత్రాలు లేకుండా, నకిలీ లేబుల్స్ ముద్రించి రైతులకు సరఫరా చేసి చేస్తున్నారని, దీంతో వీటిని స్వాధీనం చేసుకుని ఐపీసీ–420 సెక్షన్ కింద కేసు నమోదు చేయాలని అరండల్‌పేట పోలీసులను కోరడం జరిగిందని వెల్లడించారు. అరండల్‌పేట సీఐ రామనాయక్, ఎస్ఐ నాగరాజు సంఘటన స్థలానికి చేరుకుని నకిలీ బయోఉత్పత్తులు, ఖాళీ డబ్బాలు, లిక్విడ్, లేబుల్స్, మిక్సీ, జార్‌లను స్వాధీనం చేసుకున్నారు. తనిఖీల్లో స్థానిక వీఆర్ఓ బి.రాజ్యలక్ష్మి, మహిళా సంరక్షణ కార్యదర్శి ఆర్.పద్మజ తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేస్తే మంచి ఫలితాలు



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ ఆరిఫ్‌హఫీజ్

నగరంపాలెం: నేరస్తులకు ఖచ్చితంగా శిక్ష పడే విధంగా ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్‌హఫీజ్ అన్నారు. జిల్లా ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో సోమవారం పోలీస్ అధికారులు, పబ్లిక్ సర్వీస్ ప్రాసిక్యూటర్లు (పీపీ), సహాయ పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో జరిగిన సమావేశంలో ఎస్పీ మాట్లాడారు. జిల్లాల్లో అన్ని రకాల కేసుల్లో దర్యాప్తు మొదలు నుంచి ఆ కేసులు పూర్తయ్యేవరకు కోర్టులలో వచ్చే పలు సమస్యలపై చర్చించారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్, పీపీ ప్రాసిక్యూషన్ ఇరువురు సమన్వయం పాటిస్తూ, తద్వారా సహాయ సహకారాలు అందించుకుని నేరస్తులకు ఖచ్చితంగా శిక్ష పడేలా పనిచేయాలని అన్నారు. చట్టంలోని ప్రతి ఒక్క సెక్షన్‌పై న్యాయ శాఖ అధికారులకు పూర్తి అవగాహన ఉంటుందని, ఇరువురు సమన్వయంతో పని చేస్తూ, సందేహాలను నివృత్తి చేసుకుంటూ ముందుకెళ్తే బాధితులకు న్యాయం జరుగుతుందని చెప్పారు. సమావేశంలో ఏఎస్పీ (క్రైం) ఎ.శ్రీనివాసరావు, డీసీఆర్‌బీ డీఎస్పీ శ్రీనివాస్‌రావు, గుంటూరు జిల్లా పి.పి.సిరాజుద్దీన్, గుంటూరు జిల్లా ఎస్సీ,ఎస్టీ ప్రత్యేక కోర్టు పీపీ, పలువురు పీపీలు, ఏపీపీలు, ఎస్ఐ వెంకటకృష్ణ పాల్గొన్నారు.

చదువుతో పాటు నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ రామ్మోహనరావు



గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులు చదువుతో పాటు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ ఆచార్య రామ్మోహనరావు పేర్కొన్నారు. సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో జాతీయ నూతన విద్యా విధానం–2020పై వర్క్‌షాప్ సోమవారం నిర్వహించారు. రామ్మోహనరావు మాట్లాడుతూ మనం ప్రస్తుతం నాలుగో పారిశ్రామిక యుగంలో ఉన్నామని, డిజిటలైజేషన్‌కు సంబంధించిన ఉద్యోగాల కల్పనే ఎక్కువగా ఉందని వివరించారు. నైపుణ్యాభివృద్ధికి పెద్దపీట వేస్తూ రూపొందించబడినదే నూతన విద్యా విధానమని అన్నారు. చాట్ జీపీటీ వంటి మేధోపరమైన విజ్ఞానశాస్త్ర అభివృద్ధి చెందుతున్న తరుణంలో విద్యార్థులు కళాశాలలో కేవలం విజ్ఞానాన్నే సమకూర్చుకుంటే సరిపోదని, నైపుణ్యాలతో పాటు సృజనాత్మకతను పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని వివరించారు. విద్యార్థులు సమాజాన్ని అర్థం చేసుకునే విధంగా సీఎస్‌పీ, ప్రాజెక్టు, ఇంటర్న్‌షిప్స్ ఉన్నాయని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్నకుమారి మాట్లాడుతూ నూతన విద్యా విధానం విద్యార్థి కేంద్రంగా రూపొందించబడిందని తెలిపారు. కళాశాల ఐక్యూఏసీ కో–ఆర్డినేటర్ డాక్టర్ మధుసూదన్ మాట్లాడుతూ మన రాష్ట్రంలో నూతన విద్యా విధానాన్ని ప్రవేశపెట్టి మూడేళ్లు గడిచాయని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శైలజ, ఉన్నత విద్యా మండలి అకడమిక్ అధికారి డాక్టర్ విష్ణు పాల్గొన్నారు.

సీజీజీబీ ఆర్థిక సంవత్సర నివేదిక ఆవిష్కరణ



నివేదికను ఆవిష్కరిస్తున్న సీఎస్ కేఎస్ జవహర్‌రెడ్డి

నగరంపాలెం: ఏపీ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి సోమవారం చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ (సీజీజీబీ) 2022–23 ఆర్థిక సంవత్సర వార్షిక నివేదికను బ్యాంక్ చైర్మన్ టి.కామేశ్వరరావు, బ్యాంక్ ఉన్నతాధికారుల సమక్షంలో తన చాంబర్‌లో ఆవిష్కరిచారు. ఈ సందర్భంగా సీఎస్ జవహర్‌రెడ్డి మాట్లాడుతూ ఎనిమిది జిల్లాల్లో 249 శాఖలతో 27 లక్షల మంది ఖాతాదారులకు నాణ్యమైన సేవలు అందిస్తున్నారని అన్నారు. గత ఆర్థిక ఏడాదికి రూ.17,582 కోట్ల వ్యాపారంతో అత్యుత్తమ ఫలితాలు సాధించిన బ్యాంకు నిర్వాహణాధికారులు, సిబ్బంది, ఖాతాదారులను అభినందించారు. అంతేగాక ఖాతాదారుల సౌకార్యార్థం సి.జి.జి.బి. మనీ 2.0 యాప్‌ని ఆవిష్కరించడం శుభపరిణామమన్నారు. బ్యాంకు చైర్మన్ టి.కామేశ్వరరావు మాట్లాడారు. జనరల్ మేనేజర్లు డాక్టర్ బీవీ రమణరావు, పి.మారుతీరామ్, గుంటూరు రీజినల్ మేనేజర్ పి.వీరారెడ్డి పాల్గొన్నారు.

పెట్రోల్ బంక్‌లలో విజిలెన్స్ తనిఖీలు

నగరంపాలెం: గుంటూరు, బాపట్ల జిల్లాల పరిధిలోని పెట్రోల్ బంక్‌లలో సోమవారం విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేపట్టారు. గుంటూరు రీజినల్ విజిలెన్స్ ఎస్పీ కె.ఈశ్వరరావు పర్యవేక్షణలో గుంటూరు ఆటోనగర్ శ్రీ పీపీఎస్‌రావు ఫ్యూయల్ ప్రొడక్ట్స్, బాపట్ల జిల్లా బర్తిపూడిలోని గృహలక్ష్మి ఫిల్లింగ్ స్టేషన్‌లో తనిఖీలు కొనసాగాయి. తనిఖీల్లో సీఐ ఎ.శ్రీహరిరావు, తహసీల్దార్ కె.నాగమల్లేశ్వరరావు, గుంటూరు లీగల్ మెట్రాలజీ సహాయ కంట్రోలర్ కొండారెడ్డి పాల్గొన్నారు.